సాక్షి
విశాఖపట్నం
గురువారం । 5 । జూన్ । 2025

వెన్నుపోటుపై ప్రజాగ్రహం

వెన్నుపోటు నిరసన ర్యాలీ వీడియో కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి



నిరసన ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నేతలు



ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు

ఏడాది పాలనలో మోసాలు, దౌర్జన్యాలే తప్ప ఇంకేమీ లేవు

సంపద సృష్టి పేరుతో మోసం



రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ.. 'వెన్నుపోటు దినం'.. రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఒక మలుపు అవుతుంది. కూటమి ఏడాది పాలనలో మోసాలు, దౌర్జన్యాలు, అవినీతి, దోపిడీలు తప్ప మరేమీ లేవు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ ప్రతిపక్షంగా పోరాడుతూనే ఉంటాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసి కూడా చంద్రబాబు అమలుకాని హామీలిచ్చారు. సంపద సృష్టిస్తానంటూ ప్రజలను మోసం చేశారు' అని విమర్శించారు. బాబూ మీ కుమారుడు లోకేష్‌కు సంపద సృష్టిస్తున్నావా? అని ప్రశ్నించారు.

విశాఖ నగరంపై చిన్నచూపు



పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు మాట్లాడుతూ.. 'అన్ని వర్గాలను దగా చేసిన చంద్రబాబు, మంత్రి లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇప్పుడేమి సమాధానం చెబుతారు. యువగళంలో లోకేష్ ఇచ్చిన యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి హామీలు ఏమయ్యాయి. వెనుకబడిన ఉత్తరాంధ్రను కూటమి నేతలు దోచుకుంటున్నారు. విశాఖ నగరంపై చిన్నచూపు చూస్తున్నారు. అమరావతి భ్రమలో ఈ ప్రాంతానికి అన్యాయం చేస్తున్నారు. సొంత మామనే వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుకు ప్రజలను వెన్నుపోటు పొడవడం పెద్ద లెక్క కాదు! గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతీ హామీని అమలు చేసింది. ఈ ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. రైతులను అప్పుల పాల్జేసింది. వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి వచ్చిన స్పందన.. కూటమి ప్రభుత్వ పతనానికి నాందిగా మారుతుంది' అని అన్నారు.

చంద్రబాబు ఫెయిల్యూర్ సీఎం



మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ.. 'సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు హయాంలో రాష్ట్ర జీడీపీ 3.8 శాతానికి పడిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇది 8.9 శాతంగా ఉండేది. ఇది చాలదా చంద్రబాబు ఫెయిల్యూర్ సీఎం అని చెప్పడానికి.? గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.2.75 లక్షల కోట్లను సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించింది. ప్రస్తుతం చంద్రబాబు కూటమి నేతల జేబులు నింపుతున్నారు. పవన్ కల్యాణ్ సినిమా ప్రపంచం నుంచి ఇంకా బయటకు వచ్చినట్లు లేరు. ఏడాది పాలనలో మోసాలు, దౌర్జన్యాలు జరిగితే.. అట్టర్ ఫ్లాప్ సినిమా(ఏడాది పాలన)కు బాణసంచా కాల్చి పండగ చేసుకోవాలని పిలుపునివ్వడం ఆశ్చర్యంగా ఉంది' అని ఎద్దేవా చేశారు.

ప్రజలే చీపుర్లతో పండగ చేస్తారు



పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ.. 'కూటమి ఏడాది పాలనలో మోసాలు, మహిళలపై దాడులు పెరిగాయి. ఇలాంటి పరిస్థితుల్లో పండగలు నిర్వహిస్తారా? మ్యానిఫెస్టో పట్టుకుని ప్రజల ముందుకు వెళితే వారే చీపుర్లు, గరిటెలతో మీకు అన్ని పండగలు చేస్తారు. మహిళల భద్రతను గాలికొదిలేశారు. రైతులను అప్పుల ఊబిలోకి నెట్టారు. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు' అని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సుపరిపాలన కాదని.. ప్రజలు తప్పుడు హామీలకు మోసపోయారని కల్యాణి ఆవేదన వ్యక్తం చేశారు.

- 'వెన్నుపోటు దినం' నిరసనకు వెల్లువెత్తిన మద్దతు
- 'మోసగాడు చంద్రబాబు' నినాదాలతో దద్దరిల్లిన విశాఖ



కలెక్టర్ హరేందిరప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు, ఎంపీ బాబూరావు, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి, తైనాల, ఎమ్మెల్సీ కల్యాణి, సమన్వయకర్త మొల్లి అప్పారావు, ముఖ్యనేతలు కోలా గురువులు, రవిరెడ్డి, పేడాడ రమణికుమారి

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గాలికొదిలి.. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి.. అన్ని రంగాల్లోనూ ఘోరంగా విఫలమైందని ఆరోపిస్తూ 'వెన్నుపోటు దినం'పేరిట నిరసన తెలపాలని వైఎస్సార్ సీపీ ఇచ్చిన పిలుపునకు అన్ని వర్గాల నుంచి స్పందన లభించింది. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో దద్దరిల్లింది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతమైంది. పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు ఆధ్వర్యంలో తూర్పు, ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు బుధవారం ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. జెడ్పీ జంక్షన్ వద్ద ప్రారంభమైన వెన్నుపోటు నిరసన ర్యాలీ కలెక్టరేట్ వరకు సాగింది. 'వెన్నుపోటు చంద్రబాబు.. మోసగాడు చంద్రబాబు'అంటూ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష‌కుమార్, విశాఖ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, కోలా గురువులు, రవిరెడ్డి తదితరులు కలెక్టర్ ఎం.ఎ స్.హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేయడం తప్ప మరేమీ చేయలేదని, వారి వైఫల్యాలకు నిరసనగా చేపట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమం కూటమి ప్రభుత్వ పతనానికి నాంది పలుకుతుందని నేతలు హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కె.సతీష్, పార్టీ కార్యాలయం పర్య వేక్షకుడు రవిరెడ్డి, రాష్ట్ర అనుబంధ సంఘ అధ్యక్షుడు విజయచంద్ర, కార్పొరేటర్లు బానాల శ్రీనివాసరావు, అల్లు శంకరరావు, రెయ్యి వెంకటరమణ, కోరుకొండ వెంకట స్వాతి, కె.అనిల్ కుమార్‌రాజు, మొల్లి లక్ష్మి, ముప్వల లక్ష్మి, సాడి పద్మారెడ్డి, చెన్నా జానకీ రామ్, కోడిగుడ్ల పూర్ణిమ, వావిలపల్లి ప్రసాద్, శశికళ, ఉత్తరాంధ్ర యువజన విభాగం రీజనల్ ప్రెసిడెంట్ అంబటి శైలేష్, పార్టీ ముఖ్య నాయకులు కోలా గురువులు, రొంగలి జగన్నాథం, ఎండీ ఫరూఖీ, వుడా రవి, గొలగాని శ్రీనివాస్, రవిరాజు, సతీష్ వర్మ, తాడి జగన్నాథ్‌రెడ్డి, శ్రీని వాసరెడ్డి, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు పేడాడ రమణి కుమారి, బోని శివరామకృష్ణ, సనపల రవీంద్ర భరత్, బర్కత్ అలీ, ఎస్.ప్రసాదరావు, రామిరెడ్డి, బొండా ఉమా మహేశ్వరరావు, దేవరకొండ మార్కండేయులు, కాళిదాస్ రెడ్డి, అల్లంపల్లి రాజాబాబు, రామన్నపాత్రుడు, కిరణ్ రాజు, పల్లా దుర్గారావు, డా.మంచా నాగ మల్లీశ్వరి, మనలత జాబ్దాస్(చిన్ని), నీలి రవి, కొట్యాడ సూర్య, మహేష్‌బాబు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

కొత్తగా ఒక్క పింఛన్ ఇచ్చిందా?



తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు మాట్లాడుతూ.. 'సూపర్ సిక్స్ సహా 143 హామీలిచ్చి అధికారంలోకి వచ్చి.. ఇప్పుడు మోసం చేసినందుకే ఇది వెన్నుపోటు ప్రభుత్వం. మూడు లక్షల పింఛన్లు తొలగించి, కొత్తగా ఒక్క పింఛను అయినా ఇచ్చిందా? రాష్ట్రవ్యాప్తంగా విజయవంతమైన ఈ కార్యక్రమం కూటమి ప్రభుత్వ పతనానికి తొలి అడుగు' అని అన్నారు.



భీమిలి నియోజకవర్గంలో

భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. భీమిలి వుడా మినీ స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పోలీస్‌స్టేషన్, మెయిన్ రోడ్డు, గంట స్తంభం మీదుగా నూకాలమ్మ ఆలయం వరకు ర్యాలీ సాగింది. అక్కడ వేదిక వద్ద శ్రీనివాసరావు ప్రసంగించారు. అనంతరం భీమిలిలోని ఆర్డీవో కార్యాలయంలో ఏవో మనోరంజినికి వినతిపత్రం సమర్పించారు. ఈ నిరసన ర్యాలీకి నియోజకవర్గం నలుమూలల నుంచి వందలాది ఆటోలు, 100 కార్లు, 1000 బైక్‌లతో భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివచ్చారు. జెడ్పీ వైస్ చైర్మన్ సుంకరి గిరిబాబు, ముఖ్య నేతలు దాట్ల పెదబాబు, చెన్నాదాస్, ఎంపీపీలు దంతులూరి వాసురాజు, కె.రాంబాబు, మజ్జి వెంకట్రావ్, పోతిన హనుమంతురావు, అక్కరమాని రామునాయుడు, గండిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



భీమిలిలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న సమన్వయకర్త శ్రీనివాసరావు, పార్టీ శ్రేణులు

విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో



ఆర్టీసీ డిపో నుంచి భారీగా తరలివెళ్తున్న ర్యాలీలో పాల్గొన్న పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్, పార్టీ శ్రేణులు

మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. గాజువాక పాత చెక్‌పోస్టు ప్రాంతం నుంచి ప్రారంభమై శాంతిగిరి కాలనీ, ములగాడ హౌసింగ్ కాలనీ మీదుగా ములగాడ తహసీల్దార్ కార్యాలయం వరకూ ఈ ర్యాలీ సాగింది. అక్కడ ఆర్ఐ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దొడ్డి కిరణ్, నియోజకవర్గ మహిళా విభాగం ఇన్‌చార్జి పేడాడ జ్యోత్స్న, జిల్లా అధికార ప్రతినిధి ఆల్ఫా కృష్ణ, ఎస్సీ సెల్ నాయకులు మల్లేశ్వరరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి చుక్కా వరలక్ష్మి, కార్పొరేటర్లు పి.వి.సురేష్, బల్లా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన నిరసనలో పాల్గొన్న సమన్వయకర్త దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వెంకట్రామయ్య, పార్టీ శ్రేణులు

గాజువాక నియోజకవర్గంలో

గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. పాతగాజువాక జంక్షన్ నుంచి నేషనల్ హైవే మీదుగా చినగంట్యాడ 100 అడుగుల రోడ్డులోని తహసీల్దార్ కార్యాలయం వరకూ ఈ ర్యాలీ సాగింది. తహసీల్దార్ తోట శ్రీవల్లికి వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉరుకూటి అప్పారావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉరుకూటి చందు, కార్పొరేటర్లు ఇమ్రాన్, భూపతిరాజు సుజాత తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.



కదంతొక్కిన యువత



వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు



వెన్నుపోటు దినం నిరసన ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నేతలు

పెందుర్తి నియోజకవర్గంలో

పెందుర్తి మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రాంపురం నుంచి పెందుర్తి జూనియర్ కళాశాల వరకూ బైక్‌లు, కార్లతో ర్యాలీగా తరలివచ్చారు. అక్కడ నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ రోడ్డు, బీఆర్‌టీఎస్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీగా సాగారు. ముఖ్య నేతలు బి.భగవాన్ జైరాం, పైలా శ్రీనివాసరావు, కొటాన రాము, జెడ్పీటీసీ సభ్యుడు పి.ఎస్.రాజు, ఎంపీపీలు. నేతలు హాజరయ్యారు.

ఆర్పీఎఫ్ గస్తీకి మరో 13 బైక్‌లు



నూతన వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్పీఎఫ్ ఐజీ, వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, రైల్వే భద్రతా దళం సిబ్బంది భద్రతా చర్యల పెంపుదలలో భాగంగా పెట్రోలింగ్‌కు ఉపయోగపడే 13 బైక్‌లను సమకూర్చుకుంది. ఈ మేరకు ఈ వాహనాలను ఆర్పీఎఫ్ ఐజీ, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అలోక్ బోరా, వాల్తేర్ డివిజన్, డీఆర్ఎం లలిత్‌బోరా బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. వీటి ద్వారా ప్రతీ మారుమూల ప్రాంతాల్లో గస్తీ సులభతరమవుతుందని అధికారులు తెలిపారు. వీటిని మారుమూల ప్రాంతాలైన కేకే లైన్, కేఆర్ లైన్, రాయగడ-విజయనగరం సెక్షన్లలో వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ అజయ్‌ప్రకాష్ దూబే, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- రేపటి నుంచి 12 కేంద్రాల్లో పరీక్షలు
- హాజరుకానున్న అభ్యర్థులు 57,895

విశాఖ సిటీ: జిల్లాలో డీఎస్సీ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో పరీక్ష ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ నెల 6 నుంచి 30వ తేదీ వరకు మొత్తం 12 కేంద్రాల్లో జరగనున్న ఈ పరీక్షలకు 57,895 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కొమ్మాది చైతన్య ఇంజినీరింగ్ కాలేజ్, పెదగంట్యాడ ఎస్‌వీఎస్ సొల్యూషన్స్, షీలానగర్, చినముషిడివాడ-1, 2 ఐయాన్ డిజిటల్ సెంటర్లు, ఎన్ఎస్‌టీఎల్ సమీపంలోని ఏడీజెడ్ ఆర్వోనా డిజిటల్, మధురవాడ, రుషికొండ గాయత్రీ విద్యా పరిషత్, దువ్వాడ విజ్ఞాన్, కాపు జగ్గరాజుపేట విజ్ఞాన్, శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటీ, నరవ విట్స్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆన్‌లైన్ విధానంలో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందుగా హాజరుకావాలని, హాల్ టికెట్‌తో పాటు తప్పనిసరిగా ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డును తీసుకురావాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని జేసీ ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేయాలని చెప్పారు. కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలని, నిరంతర విద్యుత్ సరఫరా, హైస్పీడ్ నెట్ సదుపాయం ఉండాలన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా అదనపు బస్సులను నడపాలని ఆర్టీసీకి అధికారులకు చెప్పారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాల ఆధారంగా హాల్ టికెట్లపై ఏమైనా తప్పులుంటే సరిదిద్దుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రత్యేక అవసరాల గలవారికి అదనపు సమయం ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, ఎస్ఎస్ఏ పీవో చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, ఆర్టీసీ, విద్యుత్, పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల నిరవధిక సమ్మె విరమణ

- ఉపాధి, హక్కుల రక్షణకు ఆందోళన కొనసాగుతుంది
- విశాఖ ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ప్రకటన



సమావేశంలో మాట్లాడుతున్న అఖిల పక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు

అల్లిపురం: స్టీల్ యాజమాన్యం అక్రమంగా తొలగించిన 2,500 మంది కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ గత కొద్ది రోజులుగా విశాఖ ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెను విరమిస్తున్నట్లు అఖిల పక్ష కాంటాక్టు కార్మిక సంఘాలు ప్రకటించాయి. బుధవారం జగదాంబ దరి సీపీఎం కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ నాయకులు పి.నగేష్, సత్యారావు, నిర్వాసితుల కాంట్రాక్టు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఉమ్మిడి అప్పారావు విలేకరులతో మాట్లాడారు. ఉపాధి, హక్కుల పరిరక్షణకు తమ ఆందోళన కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. సమ్మెపై పోలీసుల అణచివేతకు వ్యతిరేకంగా.. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లాలో అలాగే రాష్ట్రంలో అనేక చోట్ల సంఘీభావ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. తమకు సంఘీభావం ప్రకటించిన ప్రజలకు, ప్రజా సంఘాలకు, పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా కాంట్రాక్ట్ కార్మికులకు సహకారం అందించాలని కోరారు.

సమీకృత హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు



మధురవాడ: మధురవాడలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు హెచ్‌డబ్ల్యూవో రమేష్ తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరంలో 3వ తరగతి నుంచి 10 వరకు చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర వర్గాలకు చెందిన బాలురు మాత్రమే అర్హులు. ఇక్కడ ఉచిత వసతితో పాటు విద్య అందిస్తారు. ఆసక్తి గల విద్యార్థులు 91548 79173లో సంప్రదించవచ్చు. ముందు వచ్చిన వారికి ప్రాధాన్యం ఉంటుంది.

హెల్త్ ఎడ్యుకేటర్స్ సర్వీసెస్ అసోసియేషన్ హర్షం


డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌ను అభినందిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వర్

విశాఖ సిటీ: హెల్త్ ఎడ్యుకేటర్ పోస్ట్ హోదాను డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా మార్పు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంపై హెల్త్ ఎడ్యుకేటర్స్ సర్వీసెస్, వెల్ఫేర్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వర్ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌కు అభినందనలు తెలిపారు. తమ అభ్యర్థన మేరకు పేరు మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎం.భానుమూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ పేర్కొన్నారు. దీనికి సహకరించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సిహెచ్.సుధాకరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ సయ్యద్ బేగం, ట్రెజరర్ ఎన్.హరి ప్రసాద్, సభ్యులు జయప్రకాశ్, అనురాధ, సుబ్బ లక్ష్మి, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రిసోర్స్ పర్సన్లకు శిక్షణ


తోటగరువు జెడ్పీ హైస్కూల్‌లో డీఆర్పీలకు నిర్వహిస్తున్న శిక్షణ

ఆరిలోవ: విద్యా శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాల రిసోర్స్ పర్సన్ల(డీఆర్పీ)కు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా శిక్షణ జరుగుతోంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. బుధవారం విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో శిక్షణ పొందిన ఎస్ఆర్పీలు(స్టేట్ ఆర్పీలు) 2015–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠశాల అకాడమీ క్యాలెండర్, గ్రంథాలయాల నిర్వహణ, సహిత విద్యలపై శిక్షణ ఇచ్చారు. ఇక్కడ శిక్షణ పొందిన డీఆర్పీలు పాఠశాలల్లో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ఈ శిక్షణలో రాష్ట్ర పరిశీలకురాలు రోజ్‌లిల్లీ, డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు, తోటగరువు హైస్కూల్ హెచ్ఎం దుర్గాభవాని, ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి కృష్ణకుమార్ పాల్గొన్నారు.

యువతకు ఉపాధి.. యోధులకు భరోసా

- పదవీ విరమణ పొందుతున్న సైనికులకు 'ఫుడ్‌క్రాఫ్ట్' అండ
- మూడు నెలల శిక్షణతో స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు
- నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి



ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్


ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ అనంతరం పరీక్ష రాస్తున్న డిఫెన్స్ ఉద్యోగులు(ఫైల్)

ఆరిలోవ: నగరంలోని ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ ప్రత్యేక గుర్తింపు పొందింది. రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఏకైక ఇన్‌స్టిట్యూట్ ఇది. ఇక్కడ శిక్షణ పొందిన ఎంతో మంది యువత దేశ విదేశాల్లో ఉద్యోగాలు సాధించడంతో పాటు స్వయం ఉపాధి మార్గాల్లో స్థిరపడ్డారు. అలాగే ఈ ఇన్‌స్టిట్యూట్‌లో రక్షణ రంగ ఉద్యోగులకు సైతం వృత్తి నైపుణ్య శిక్షణ అందిస్తూ వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నారు. విశాఖపట్నం రూరల్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో 1986లో ఈ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటైంది. అప్పటి నుంచి వేలాది మంది నిరుద్యోగ పేద యువతకు అండగా నిలుస్తోంది. పదో తరగతి ఉత్తీర్ణులైన యువతీ యువకులకు వంటలు, హాస్పిటాలిటీ, బేకరీ వంటి పలు విభాగాల్లో శిక్షణ ఇచ్చి, వారిని సొంతకాళ్లపై నిలబడేలా తీర్చిదిద్దుతోంది.

రక్షణ రంగ ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ

2017 నుంచి ఈ ఇన్‌స్టిట్యూట్ తన సేవల పరిధిని మరింత విస్తరించింది. కేంద్ర ప్రభుత్వ చొరవతో డిఫెన్స్ రంగంలోని ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగులకు వంటల తయారీలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఉద్యోగ విరమణకు ఆరు నెలల గడువు ఉన్న వారిలో ఆసక్తి కలిగిన వారిని ఎంపిక చేసి, వారికి ఈ శిక్షణ అందిస్తున్నారు. డైరెక్టర్ జనరల్ రీసెటిల్‌మెంట్(డీజీఆర్) ఆధ్వర్యంలో ఐఐటీ, ఎన్ఐటీ, ఎఫ్‌సీఐ వంటి సంస్థలతో పాటు ఫుడ్‌క్రాఫ్ట్ ఇనిస్టిట్యూట్‌లో కూడా ప్రీ రిలీజ్ కోర్సు(పీఆర్‌సీ)లలో భాగంగా ఈ శిక్షణను అందిస్తున్నారు. ఈ శిక్షణకు సంబంధించిన పూర్తి వ్యవహారాలను, ఖర్చులను కేంద్ర ప్రభుత్వమే భరిస్తోంది. ఇక్కడ ఉత్తర, దక్షిణ భారత వంటకాలతో పాటు హాస్పిటాలిటీ, బేకరీ, టూరిజం (హోటల్ మేనేజ్‌మెంట్) వంటి విభాగాల్లో నిష్ణాతులైన ఇన్‌స్ట్రక్టర్ల ద్వారా తర్ఫీదు ఇస్తున్నారు. 2017 నుంచి ఇప్పటివరకు 24 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేశారు. ప్రతీ బ్యాచ్ మూడు నెలల కాలపరిమితితో నడుస్తుంది. శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్ అందజేస్తారు. ఈ సర్టిఫికెట్‌తో వారు పదవీ విరమణ అనంతరం స్వయం ఉపాధి పొందడానికి లేదా ఇతర సంస్థల్లో ఉద్యోగాలు సంపాదించడానికి మార్గం సుగమం అవుతోంది.

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు

ఇక్కడ శిక్షణ పొందిన పలు రాష్ట్రాలకు చెందిన డిఫెన్స్ ఉద్యోగులు తమకు అనుకూలమైన ప్రాంతాలు, పట్టణాల్లో విజయవంతంగా ఉపాధి పొందుతున్నారు. కొందరు విశాఖ నగరంలోని పలు హోటళ్లు, గీతం వంటి యూనివర్సిటీల్లో ఉద్యోగాల్లో స్థిరపడగా, మరికొందరు ఇతర రాష్ట్రాల్లో సొంతంగా హోటళ్లు, పార్లర్లు కూడా నిర్వహిస్తున్నారు. ఉదాహరణకు ఒడిశాకు చెందిన తుస్టి అనే ఆర్మీ ఉద్యోగి ఇక్కడ శిక్షణ పొందారు. పదవీ విరమణ తర్వాత తన పేరుతోనే ఒక పార్లర్‌ను విజయవంతంగా నడుపుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిర్వహణలో కొనసాగుతున్న ఈ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్.. అటు నిరుద్యోగ యువతకు, ఇటు దేశ సేవలో తరించిన సైనికులకు ఉపాధి మార్గాలను చూపుతూ ఆదర్శంగా నిలుస్తోంది.


శిక్షణలో తయారు చేసిన వంటకాలు


శిక్షణ పొందిన అనంతరం డిఫెన్స్ ఉద్యోగి ఒడిశాలో నిర్వహిస్తున్న పార్లర్

రిటైర్‌మెంట్ అనంతరం నూతన కెరీర్



ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో 2024 బ్యాచ్‌లో 'డిప్లమో ఇన్ బ్యాంక్విట్ మేనేజ్‌మెంట్'లో మూడు నెలల పాటు శిక్షణ పొందాను. ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగ విరమణ అనంతరం గీతం వర్సిటీలో హాస్పిటాలిటీ సర్వీస్‌లో ఉద్యోగంలో చేరాను. ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందడం వల్ల నాకు రిటైర్ అయిన తర్వాత కూడా ఉపాధి లభించింది.

– ఆర్.అనూప్, రిటైర్డ్ ఉద్యోగి, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్

శిక్షణ వల్లే సాధ్యమైంది



2024 బ్యాచ్‌లో ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో హాస్పిటాలిటీలో శిక్షణ పొందాను. మూడు నెలల శిక్షణ అనంతరం తిరిగి ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగంలో చేరాను. మూడు నెలలు తర్వాత రిటైర్ అయ్యాను. అనంతరం గీతం యూనివర్సిటీలో ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగం లభించింది. ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో పొందిన శిక్షణ వల్లే ఇది సాధ్యమైంది. దీంతో నా కుటుంబాన్ని పోషించుకోవడానికి వేరే చోట ఉద్యోగం కోసం వెతకాల్సిన పని తప్పింది.

– శ్రీకాంత్, రిటైర్డ్ ఉద్యోగి, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్

డిఫెన్స్ ఉద్యోగులకు ఉపాధి అవకాశాలు



2017 నుంచి డిఫెన్స్ ఉద్యోగులకు ఫుడ్ క్రాఫ్ట్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటివరకు 24 బ్యాచ్‌ల్లో 796 మందికి శిక్షణ అందించి సర్టిఫికెట్లు అందజేశాం. ఇక్కడ శిక్షణ పొందినవారు డిఫెన్స్‌లో రిటైర్ అయిన వెంటనే వివిధ రంగాల్లో ఉద్యోగాలు పొందుతున్నారు. కొందరు సొంతంగా హోటళ్లు, పార్లర్లు నిర్వహిస్తున్నారు. ఇది వారికి చాలా మంచి అవకాశం. ఈ శిక్షణకు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది.

–కె.వి.రమణ, ప్రిన్సిపాల్, ఫుడ్‌క్రాఫ్ట్ ఇనిస్టిట్యూట్, విశాఖపట్నం

బావిలో పడి వ్యక్తి మృతి

పెందుర్తి: తోటి కూలీలతో కలిసి సరదాగా ఈతకు వెళ్లిన ఓ వ్యక్తి నీట మునిగి మృతి చెందాడు. పెందుర్తి మండలం ముదపాకలో ఈ ఘటన చోటు చేసుకుంది. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా తెర్లాంకి చెందిన పక్కి ప్రసాద్(25) ముదపాకలోని జగనన్న కాలనీలో నిర్మాణ పనులు చేసుకుంటూ అక్కడే ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి పనులు చేసిన తరువాత సమీపంలోని బావిలోకి తోటి ముగ్గురు నిర్మాణ కూలీలతో కలిసి ఈతకు వెళ్లాడు. మిగిలిన వారు వెళ్లిపోదాం అంటే 'నేను కాసేపు ఉండి వస్తాను' అని చెప్పడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రసాద్ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తోటి కూలీలు బావి వద్దకు వెళ్లారు. అక్కడ దుస్తులు ఉండడంతో ప్రసాద్ నీటిలో మునిగిపోయి ఉండవచ్చని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఆదేశాల మేరకు ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ప్రసాద్ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు జరుగుతుంది.


ప్రసాద్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

జాతీయ రహదారిపై కారు దగ్ధం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆరిలోవ: జాతీయ రహదారిపై బుధవారం ఉదయం ప్రయాణిస్తున్న ఒక కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. అదృష్టవశాత్తు కారులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. మధురవాడ నుంచి నగరానికి వెళ్తున్న ఒక కారు జూ పార్కు సమీపంలోకి రాగానే పొగలు రావడం డ్రైవర్ గమనించాడు. వెంటనే అప్రమత్తమై కారును రోడ్డు పక్కన నిలిపివేశాడు. కారు ఆపిన వెంటనే మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. ఈ ఘటనతో వెనుక వస్తున్న ఇతర వాహనదారులు భయపడి సుమారు అర కిలోమీటరు దూరంగా తమ వాహనాలను నిలిపివేశారు. కారులో ఉన్నవారు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఆరిలోవ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే మంటలు తీవ్రంగా ఎగిసిపడుతున్నాయి. సిబ్బంది వెంటనే మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కానీ అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. కారు లోపల షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగి ఉంటాయని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు. ఈ ఘటనపై ఆరిలోవ పోలీసులు ప్రమాదవశాత్తు కారు దగ్ధమైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీలో తొలి సిరామిక్ మోకాలి సంయోజన శస్త్రచికిత్స

- తొలి రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స
- ఘనత సాధించిన ఎంజీఎం సెవెన్‌హిల్స్ హాస్పిటల్


వివరాలు వెల్లడిస్తున్న, వివరిస్తున్న డాక్టర్ సుశాంత్‌కుమార్

డాబాగార్డెన్స్: విశాఖలోని ఎంజీఎం సెవెన్‌హిల్స్ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సుశాంత్‌కుమార్ మల్లిక్ నేతృత్వంలో రాష్ట్రంలో రెండు చారిత్రాత్మక ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి కుడి మోకాల్లో అడ్వాన్స్‌డ్ స్టేజ్–4 పోస్ట్ ట్రమాటిక్ ఆస్టియో ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నాడు. ఎంజీఎం సెవెన్‌హిల్స్ హాస్పిటల్లో చేరగా వైద్య బృందం రాష్ట్రంలోనే తొలి సిరామిక్ మోకాలి సంయోజన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. మెటల్ ఇంప్లాంట్స్ కంటే సిరామిక్ ఇంప్లాంట్స్ ఎక్కువ కాలం నిలిచి, అలర్జీ కలిగించని, బయో కంపాటిబుల్ లక్షణాలతో రోగులకు మెరుగైన, దీర్ఘకాల ఫలితాలు ఇస్తాయన్నారు. అలాగే రాష్ట్రంలోనే తొలి రివర్స్ షోల్డర్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. ఒడిశాలోని బొలంగీర్‌కు చెందిన 48 ఏళ్ల సునీల్‌కుమార్ బిశ్వాల్ రొటేటర్ కఫ్ ఆర్థోపతి, సికిల్‌సెల్ వ్యాధి కారణంగా షోల్డర్ జాయింట్‌లో తీవ్ర సమస్యలు ఏర్పడ్డాయి. దీనికి అధునాతన శస్త్రచికిత్స చేసినట్లు తెలిపారు. ఈ పద్ధతిలో భుజం కీళ్ల నిర్మాణం రివర్స్ చేయబడుతుందని, డెల్టాయిడ్ మజిల్ రొటేటర్ కఫ్ ద్వారా భుజం కదలికలను పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. ఈ శస్త్ర చికిత్స ద్వారా రోగి జీవిత నాణ్యతలో మెరుగుల కనిపించిందని, ఇంతకు ముందు ఇదే హాస్పిటల్లో హిప్ రివిజన్ శస్త్రచికిత్స విజయవంతంగా చేసుకున్న రోగి ప్రస్తుతం ఫిజియోథెరపీతో కోలుకుంటున్నాడని చెప్పారు. సమావేశంలో మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అశుతోష్ చందర్ సుద్, జనరల్ మేనేజర్ సందీప్‌కుమార్ లెంక, డీజీఎంలు అశోక్ పట్నాయక్, వై.రమేష్ పాల్గొన్నారు.

గర్భశోకం

- ప్రాణం తీసిన ఈత సరదా
- వరాహ నదిలో మునిగి అన్నదమ్ముల మృతి
- తల్లిదండ్రులకు తీరని వేదన


పిల్లల మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు


సొమ్మసిల్లిన తల్లి లక్ష్మి

కోటవురట్ల: మాటలకందని విషాదం.. పగవారికి సైతం రాకూడని ఉత్పాతం.. వరాహ నదిలో మునిగి అన్నదమ్ములు మృతి చెందారు.. ఉన్న పిల్లలిద్దరూ కన్నుమూయడంతో తల్లిదండ్రులు అంతులేని వేదనతో కన్నీరుమున్నీరయ్యారు. మీరే లేకపోతే ఇక మాకెందుకు ఈ బతుకు అంటూ వారు విలపిస్తున్న తీరు అందరి మనసులను కలచివేసింది. ఈ హృదయ విదారక ఘటన కోటవురట్ల శివారు జానకీరాంపురంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సుర్ల దేవా (14), సుర్ల హిమవంత్ (10), అల్లు నాయుడులతోపాటు కె.వెంకటాపురానికి చెందిన పోలుపర్తి మోహన్ ఉదయం 8 గంటల సమయంలో గ్రామాన్ని ఆనుకుని ఉన్న వరాహ నదిలోకి ఈత కొట్టేందుకు దిగారు. ఒకచోట లోతు ఎక్కువగా ఉండడంతో అన్నదమ్ములైన దేవా, హిమవంత్ గోతిలో పడి మునిగిపోయారు. మిగతా ఇద్దరు పిల్లలు కేకలు వేయడంతో స్థానికులు వచ్చి వారిని బయటకు తీశారు. అప్పటికే అన్నదమ్ములిద్దరూ ఊపిరాడక మృతి చెందారు. అల్లు నాయుడు బాగానే ఉండగా పోలుపర్తి మోహన్‌ను స్థానిక సీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయించారు. పిల్లలు ఈతకు వెళ్లే సమయానికి మృతుల తల్లిదండ్రులు సుర్ల రాము, సుర్ల లక్ష్మి ఉపాధి పనికి వెళ్లారు. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న వారిని ఆపడం ఎవరి తరం కాలేదు. మృతుల్లో పెద్దవాడైన దేవా చిన్నతనం నుంచి తాతగారి ఊరు రోలుగుంట మండలం రొంగలిపాలెంలో ఉంటూ రోలుగుంటలో చదువుకుంటున్నాడు. ఇటీవల తలుపులమ్మతల్లి పండగ జరగడంతో తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. సెలవులు కావడంతో తమ్ముడు హిమవంత్, మిగతా పిల్లలతో కలిసి నదిలోకి దిగి ప్రమాదంలో చిక్కుకున్నా రు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ రమేష్ సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేశారు. మృతుల తండ్రి సుర్ల రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలకు స్థానిక సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ఎస్ సత్యనారాయణరాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, సర్పంచ్ బి.అనిల్‌కుమార్ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.


దేవా (ఫైల్)


హిమవంత్ (ఫైల్)